క్లుప్తంగా

జాతరలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన్న జాతరలో సోమవారం నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జాతకు వచ్చిపోయే భక్తులకు అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించేందుకు శిబిరం నిర్వహించారు. శిబిరంలో హెల్త్ అసిస్టెట్ రాథోడ్ కృష్ణ, ఏఎస్ఎం రేణుక, ఆశవర్కర్లు గంగామణి, సరోజ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకొని ముందుకు సాగాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతీఖ్ బేగం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, మెళకువలను పూర్తిస్థాయిలో నేర్చుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు, గజానంద్, కునాల్ యాదవ్, భార్గవి పాల్గొన్నారు.

'విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి'



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడ ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిపై న్యాయ విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ సాయి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బజార్‌హత్నూర్ మండలంలోని వైరోతండాకు చెందిన లాలిత్య అనే విద్యార్థిని ఇచ్చోడ మండలంలోని ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత మృతి చెందినట్లు పేర్కొన్నారు. వసతి గృహంలో వార్డెన్, ప్రిన్సిపల్ లేకపోవడంతో ఆమె మృతి చెందినట్లు ఆరోపించారు. సమావేశంలో నాయకులు సక్కు, గణేష్, సాయి, కిరణ్, నగేశ్, విశాల్, తరుణ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. మండలంలోని గుత్పాల గ్రామంలో గల ట్రైబల్ మినీ గురుకులంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే విద్యార్థినులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ నరేశ్, కల్పన, భారతి, హాస్టల్ హెచ్ఎం అనురాధ, వాణిశ్రీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు

సిరికొండ: మండల కేంద్రంలో సోమవారం బోథ్, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేలు పర్యటించారు. ఈసందర్భంగా మండలానికి మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు బోథ్ ఎమ్మెల్యే సుంకిడి గ్రామంలో నిర్మిస్తున్న జగదంబ దేవి ఆలయ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్ర భవనానికి, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుమూల మండలంను ప్ర త్యేక నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. భవ న నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఫణీందర్, తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.

దారి నిర్మించరూ..!



సుర్దాపూర్‌కు వెళ్లే దారి

- సుర్దాపూర్ వెళ్లేందుకు చేను దారే దిక్కు
- వర్షం పడితే నరకమే
- పట్టించుకోని అధికారులు, పాలకులు

బోథ్: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అభివృద్ధిలో దూసుకుపోతున్నామని ప్రజా ప్రతినిధులు చెప్పడమే కానీ గ్రామాలను అభివృద్ధి మాత్రం చేయడం లేదు. అనేక గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్యం కూడా లేదు. బోథ్ మండలంలోని పట్నాపూర్ పరిధిలోని పల్లె సుర్దాపూర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామం ఏర్పడి 45 ఏళ్లు అవుతున్నా.. కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదు. చేనుకు వెళ్లే దారిలోనే నడుస్తూ గ్రామానికి చేరుకుంటున్నారు. కనీసం ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. ఇక వర్షాకాలంలో తమ ఇబ్బందులు వర్ణణాతీతమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వర్షం పడితే బురదలో నడవాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో ఎడ్ల బండిని ఉపయోగించి ఆసుపత్రులకు తీసుకెళ్తున్నామని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో 11 కుటుంబాలు,70 మంది నివాసముంటున్నారు.



సుర్దాపూర్ గ్రామం

తప్పని తిప్పలు..

గ్రామానికి దారి లేకపోవడంతో మర్లపెల్లి– బోథ్‌కు వెళ్లే ప్రధాన రహదారికి చేరుకునేందుకు కిలోమీటరు మేర చేను గట్ల వెంబడి నడవాలి. ప్రతీరోజు బోథ్ మండల కేంద్రానికి వెళ్లే విద్యార్థులు, రైతులు, ఇతరత్రా పనుల కోసం వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో బురదలో నడవలేని పరిస్థితి. ఇక రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులు తీసుకురావాలంటే బురదలోనే మోయాలి. రైతులు విత్తనాలు, యూరియా బస్తాలతో పాటు సామగ్రి గ్రామానికి తీసుకువచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లేందుకు ఎడ్లబండ్ల ద్వారా బురదలో వెళ్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోలను కలిసినా.. ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. చేను గట్టు వెంబడి నడుస్తూ వెళుతున్నాం. పట్నాపూర్ నుంచి రేషన్ సరుకులు గ్రామానికి తీసుకెళ్లలేని పరిస్థితి. ఆటోలు కూడా గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొంది.

– ఆడెం ప్రకాష్, గ్రామస్తుడు

వానాకాలం నరకమే



గ్రామానికి రోడ్డు లేదు. చేనుగట్టు మీద నుంచి కిలోమీటరు నడిచి వెళుతున్నాం. వానాకాలంలో మరింత ఇబ్బంది పడుతున్నాం. వర్షం కురిస్తే బురదలో నడవలేని పరిస్థితి. కనీసం నిత్యావసర వస్తువులు కూడా తీసుకురాలేక పోతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు వేసేలా చూడాలి.

– ఆడెం శ్రీనివాస్,గ్రామస్తుడు

ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సాత్నాల మండలంలోని రామాయిలో నూతనంగా నిర్మించిన శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో 18 రామాలయాల నిర్మాణాలు జరిగాయన్నారు. ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో పండుగ వాతావరణంతో పాటు ఆధ్యాత్మికత నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్, రత్నాకర్ రెడ్డి, ఆదిత్య, సురేశ్, సుభాష్, వసంత్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

బేల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని కొబ్బాయి గ్రామంలో శివనేరీ యూత్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లో క్రీడ మైదానాలు ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోనిగిరివార్ గణేష్, ఠాక్రే మురళీధర్, రామెల్లి మోరేశ్వర్, ఠాక్రే సందీప్, మెంచు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కాలనీవాసులను నాణ్యతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

సమయ పాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. సోమవారం మండలంలోని ఉమ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌తో పాటు విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన శాఖపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఎండలు అధికంగా ఉండడంతో పాఠశాలలో మంచి నీరు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ లోపాలను సరిదిద్దాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: ఎస్సీ వర్గీకరణలో ప్రతిపాదిత లోపాలను సరిదిద్ది అన్ని కులాలకు సమన్యాయం చేయాలని మహార్ నేతకాని ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు డిమాండ్ చేవారు. సోమవారం బీఆర్‌కే భవన్ హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ తెలంగాణ వారికి వినతిపత్రం అందజేసినట్లు ఫోరం ప్రతినిధులు కొలేట్కర్ పరమేశ్వర్, జాడే నాగోరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన రాష్ట్రాల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ చేసినప్పుడు రిజర్వేషన్ శాతాన్ని పెంచి వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కులగణన 2024 జనాభా ప్రతిపాదిన రిజర్వేషన్‌ను పెంచి గ్రూపులుగా వర్గీకరించాలన్నారు. నేతకాని మహార్ కులాలను ఎస్సీ (సి) రిజర్వేషన్ కేవలం 5 శాతం చూపించడం జరిగిందన్నారు. నాయకుడు కార్మకర్ బ్రిజులాల్, అనిల్ కాంబ్లే, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



దుకాణాన్ని ప్రారంభిస్తున్న గణేశ్‌రెడ్డి

తలమడుగు: యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి అన్నారు. మండలంలోని ఖోడద్ గ్రామంలో సంగర్తి అశోక్ కిరాణా జనరల్ స్టోర్‌ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సత్యనారాయణను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సాకె ఆనంద్, వెంకన్న యాదవ్, మెంబర్ బాబు ఖాన్, దేవిదాస్, సుదర్శన్, గంగన్న పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించి.. సమస్యలు పరిష్కరించి



అర్జీదారుల సమస్యలు వింటున్న అధికారులు

సిరికొండ: జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సిరికొండ మండలంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వచ్చిన 57 అర్జీలను బహిరంగ విచారణ చేసి సమస్యలను విచారణ చేపట్టి పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఫణీందర్, తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్ కుమార్, మండల వ్యవసాయాధికారి శ్రద్ధరాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి

ఇచ్చోడ: ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించేందుకే ప్రభుత్వం మండలాల్లో బహిరంగ విచారణ వేదికలను ప్రారంభించినట్లు జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కర కేంద్రంలో మాట్లాడారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న విచారణ వేదికల ద్వారా ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరానికి నోచుకుంటున్నాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో సత్యానంద్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు మారుతి కుమారుడు జెల్పేట్ వినోద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతు మరణించిన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

పాఠశాల తరలింపులో వివాదం

- పెండింగ్ అద్దె చెల్లించాలంటున్న భవన యజమాని

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల తరలింపు విషయంలో పాఠశాల సిబ్బంది, భవన యజమాని మధ్య వివాదం కొనసాగుతోంది. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గత మూడు సంవత్సరాల నుంచి మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. విద్యార్థులకు సరిపడా వసతులు లేనందున మరో అద్దె భవనంలోకి మారుస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రస్తుత భవన యజమాని పాఠశాల సామన్లు తరలించడాన్ని అడ్డుకున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, ఆర్సీవో గోపించంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ప్రసుత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా వసతులు లేనందున పాఠశాలను ఇతర భవనంలోకి మారుస్తున్నట్లు తెలిపారు. అగస్టు నుంచి భవనానికి కిరాయి పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే.. నేరుగా భవన యజమాని బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. మార్చి చివరి వరకు నూతన భవనంలోకి పాఠశాలను తరలిస్తామన్నారు. రెండు సంవత్సరాల నుంచి అద్దె పెండింగ్‌లో ఉందని వాటిని చెల్లిస్తే పాఠశాల తరలించేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదని భవన యజమాని తెలిపారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల

భక్తి భావనతోనే మానసిక ప్రశాంతత



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: భక్తి భావనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామంలో శబరిమాత ఆలయ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లకిని మోశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత భక్తిమార్గంలో నడవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సైబర్‌నేరాలపై అవగాహన

బజార్‌హత్నూర్: గిర్నూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, గుట్కా, బెల్టుషాపుల వల్ల ప్రజలు ఎలా నష్టపోతున్నారో కళ్లకు కట్టినట్లు వివరించారు. వాహనదారులు, రోడ్డు సేఫ్టీ రూల్స్ పాటించాలన్నారు. ఏఎస్సై లింబాజీ, ప్రకుల్, సుధాకర్, చంపత్, ప్రణయ్, నర్సయ్య, మాజీ సర్పంచ్ కృష్ణ, వినోద్, ఉపేందర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బోథ్ వీడీసీ అధ్యక్షుడిగా పోతన్న



అల్లకొండ పోతన్న

బోథ్: బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా అల్లకొండ పోతన్న ఎన్నికయ్యారు. సోమవారం మండ ల కేంద్రంలోని షాదిఖానాలో గ్రామంలోని 38 కు లాల సభ్యులు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అల్లకొండ పోతన్న, బూస రాము, పాలిక్ చంద్రమోహన్‌లు అధ్యక్ష పదవికి పోటీ పడగా, అల్లకొండ పోతన్న విజయం సాధించారు. కా గా ప్రధాన కార్యదర్శిగా సాయినాథ్ గౌడ్, కోశాధికారిగా రాయిపెల్లి రమాకాంత్‌తో పాటు ఐదుగురిని ఉపాధ్యక్షుడిగా, పలువురిని కార్యవర్గ సభ్యులుగా, సలహాదారులుగా ఎన్నుకున్నారు. కులమతాలకు అతీతంగా బోథ్ గ్రామాభివృద్ధికి పాటుపడతామన్నారు.

సంక్షిప్త వార్తలు

మార్కెటింగ్ రంగంలో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి, సెంట్రల్ ఇన్సిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక కేబీ కాంప్లెక్స్ వైటీసీ కేంద్రంలో గిరిజనులకు సూక్ష్మ, చిన్న తరహా కుటీర పరిశ్రమల నిర్వాహణ ద్వారా నిర్వాహణ, అభివృద్ధి అంశంపై అవగాహన కల్పించారు. ఇన్సిట్యూట్ ఆఫ్ లూల్ డిజైన్ తరుపున అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, ట్రైనర్‌లు విజయ్‌కుమార్‌లు పరిశ్రమల నిర్వాహకులకు శిక్షణ అందించారు.

ప్రజా సేవ కోసమే వెడ్మ ఫౌండేషన్

ఉట్నూర్‌రూరల్: ప్రజా సేవ కోసమే వెడ్మ ఫౌండేషన్ నిర్మితమైందని వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో వెడ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. నిస్సాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సేవ చేయాలన్న తపనతో ఫౌండేషన్‌ను స్థాపించడం జరిగిందన్నారు.

క్రీడలతో ప్రయోజనాలు

ఉట్నూర్‌రూరల్: క్రీడల వల్ల ఉద్యోగ విద్యా అవకాశాలే కాకుండా సమాజంలో గుర్తింపు, ఆరోగ్యం, డబ్బు, ప్రతిష్ఠ అన్ని లభిస్తాయని ఐటీడీఏ ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్ అన్నారు. సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఎంపిక పోటీలను జెండా ఊపి ప్రారంభించారు.

భూమి విరాళం

బేల: మండలంలోని దేవ్‌జీగూడ గ్రామంలో ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలో పీఎం జన్‌మన్ నిధులు రూ.60 లక్షలతో అత్యంత వెనుకబడ్డ పీవీటీజీ ఆదివాసీల కోసం మంజూరైన మల్టీపర్పస్ సెంటర్ (ఎంపీసీ) ప్రభుత్వ భవనం నిర్మాణం కోసం సోమవారం ఆదివాసి రైతు తుంరం బాపురావు నాలుగు గుంటల భూమిని విరాళంగా అందించారు. మండల తహసీల్దార్ కొట్నాక రఘునాథ్ భూమిపత్రాలు అందజేశారు.

ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని ఆకోలి గ్రామ రామాలయంలో, సాత్నాల మండలంలోని రామాయి గ్రామంలో నిర్మించిన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి రామాయి గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

తలమడుగు: మండలంలోని పల్లి(కె) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఘనంగా శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చుశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేశ్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, కేదరేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, పాండు, లక్ష్మణ్, భూమారెడ్డి, రామచందర్ రెడ్డి, చినస్వామి పాల్గొన్నారు.

సామూహిక లింగాష్టక పారాయణం

బోథ్: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర మందిరంలో ప్రతీ సోమవారం సామూహిక లింగాష్టక పారాయణం నిర్వహిస్తున్నారు. ఉదయం 7:30 గంటలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని లింగాష్టకం నిర్వహించారు.

సూచిక బోర్డులపై ఫ్లెక్సీలు



నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతం వెళ్లే రహదారిపై ఉన్న జలపాతం సూచిక బోర్డులపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు జలపాతం వివరాలతో పాటు దారి తెలియక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మేల్కొని సూచిక బోర్డులపై ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న డీఈ పవార్ రమేశ్

ఇంద్రవెల్లి: గ్రామాల్లో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ డీఈ పవార్ రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామంలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లుల్లో కోతలు విధిస్తున్నామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆదిలాబాద్
99516 02888
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899